# గోడ మీద బల్లి

పులికంటి కృష్ణారెడ్డి




ఆరునూరయినా నూరు ఆరయినా అగ్రహారం కొల్లపోయినా ఆ రోజు ఎలాగయినా 'ఎగ్జిబిషన్' చూసితీరాలను కున్నది అండాళమ్మ!

ఆ ఊళ్ళో 'ఎగ్జిబిషన్' ఆరంభించి ఆనాటికి సరిగ్గా ఆరురోజులయింది. ఆరంభించినమరుసటి రోజునుండి 'ఎగ్జిబిషన్' చూడాలని అనుకుంటూనే ఉంది అండాళమ్మ. అనుకొంటూ పతిదేవుడితో అనలేక అంటూనేఉంది. పతిదేవుడు వినీవినట్లు వింటూనే ఉన్నాడు.

అనడము .... వినడముతోనే సరిపోతూఉంది. ఆలోచన అనికిరానంటూ ఉంది. ఆలోచనతో పోటీపడి అడుగు ముందుకు పడనంటూ ఉంది. అడుగు ముందుకు పడకపోయేసరికి ఆవేదన పడుతూఉంది. ఆవేదనపడుతూ తీవ్రంగా ఆలోచిస్తూ ఉంది.

పాపం! పతిదేవుడు. అయిదు గంటలకే నిద్రలేస్తున్నాడు. పచ్చి మంచినీళ్ళయినా నోట్లో పోసుకోకుండా ఫైళ్ళ ముందు కూర్చుంటున్నాడు. కన్నబిడ్డల మీద కంటే ఆయనగారికి ఆ ఫైళ్ళమీద మక్కువ ఎక్కువ. ఎందుకంటే-అన్నీ అమరితేనే - ఎప్పుడో ముందు ముందెప్పుడో బిడ్డలు అంత తిండి మొగాన విదిలిస్తే విదిలిస్తారు లేకుంటే లేదు. కానీ ఫైళ్ళు అలాగాదు. అవి అప్పుడింత తిండి బెడుతున్నాయి. అందుకే నలుగురితో కలిసి ఆఫీసులో చేసేసేవ చాలక యింటికి కూడా మోసుకుని వస్తూంటారు-ఏకాంత సేవకోసం! - పురుషుడన్న ప్రతివ్యక్తికీ ఎలాగు కొంత సేవ ఉండనే ఉంది-

అయిదు గంటలకే నిద్రలేచిన పతిదేవుడు గంటా గంటన్నరసేపు ఫైళ్ళను సముదాయిస్తాడు. ఉన్నట్లుండి ఏదో మతికి తెచ్చుకొన్నవాడిలాగ ఉలిక్కిపడి లేచి యింట్లో దిక్కులు చూస్తాడు. కంట పడిన సంచిని చేతి కందుకొంటాడు. గబగబా మార్కెట్టుకు వెళ్ళతాడు!

వెళ్ళినంత త్వరగానే తిరిగి వస్తాడు. వారం రోజులు పస్తుండిన కడుపులా 'వళ వళ' లాడుతుండిన సంచి తినివిన కడుపులాగ ఉబ్బిఉంటుంది. కూరానారలతో! ఆ సంచిని ఆప్యాయంగా అందుకొంటుంది అండాళమ్మ. అప్పుడు పచ్చి మంచినీళ్ళను నోట్లో కాదు కానీ - రెండు చెంబులు 'బొళబొళ' నెత్తిన కుమ్మరించుకుంటాడు. అండాళమ్మ కప్పు కాఫీతో ప్రత్యక్షమవుతుంది. ఆప్యాయంగా అందుకొన్నట్లుగాదు కానీ-అమాంతంగా లాక్కొన్నట్లుగా లాక్కొని, ఆ కప్పు కాఫీ ఖాళీ చేసేసరికి 'మరి! నా మాట!' అంటుంది గోడమీది గడియారం. ఆ గడియారం తాతముత్తాతల నాటిది. తాతముత్తాతలలాగానే తప్పు పలకడానికి నేర్వనిదా గడియారం.'అయ్యో! అప్పుడే తొమ్మిదయిపోయిందే? .... ఈ రోజు కూడా తప్పవన్నమాట దీవనలు.... ' అని గొణుకుంటూ కన్నబిడ్డలకంటే ప్రేమతో ఫైళ్ళను చంకకెత్తుకుంటాడు. ఆపైన పరుగో పరుగు!....

అలా పరుగులమీద వెళ్ళిన పతిదేవుడు తిరిగివస్తాడు, ఎప్పుడు? .... సాయంత్రం .. ఆరేడు గంటలకో! ఎలా? - వాడిన తోటకూర కాడలాగ కాళ్ళీడ్చుకొంటూ! -

అలా అలసిసొలసి వచ్చిన పతిదేవుడిమీద ఎంతో జాలి అండాళమ్మకు.

అందుకే ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటలకు అరగంట ముందుగానే వాకిట్లో నిలబడుతుంది. వచ్చేపోయ్యే వాళ్ళను చూసుకొంటూ పతిదేవుడి కోసం ఎదురుచూస్తుంది. అల్లంత దవ్వులో అతడు కనుపించగానే ఆమె కన్నుల్లో కోటి దివ్వెల కాంతికోలాటం వేస్తుంది. అతడు సమీపించగానే చంకబిడ్డని ఆమె యివ్వాలి. అతడు ఆప్యాయంగా అందుకోవాలి. కానీ అలా కాదు. అతడు సమీపించగానే ఆమె చంకబిడ్డను కింద దింపుతుంది. అది ఏడుస్తున్నా లెక్కచేయకుండా అతని చంకబిడ్డల్ని అందుకొంటుంది ఏంతో అనువుగా చనువుగా!

అతడు బట్టలు మార్చుకొని మొగం కడుక్కొని వచ్చేసరికి వేడివేడి కాఫీ అందిస్తుంది. అందులో నింపిన అనురాగాన్ని చప్పరిస్తూ అతడు అనురాగాన్ని చిప్పిలిస్తుంటాడు. ఆ అదనున అండాళమ్మ ఆరంభిస్తుంది,

"అప్పుడే అయిదురోజులయిపొయ్యాయండీ!"—సంకోచాన్ని కలిపి సాగదీస్తుంది మాటల్ని!

తొట్టిబిడ్డ చంకకు వచ్చిరాలేదు. 'అప్పుడే అయిదురోజులు అయిందండీ!' అంటున్నదే అవి అయోమయంగా చూస్తాడామెవైపు పతిదేవుడు. అతని సందేహాన్ని చదువలేని అండాళమ్మ —

"అదేందండీ? అలా ఆముదం తాగిన మొగం పెడుతున్నారే!... నేనేం వన్నా ఉట్టికెక్కించి ఊరేగించమన్నానా? లేకుంటే-పైనుండి కిందికి దిగేయమన్నానా? ఊరుకాని ఊళ్లో కాదు. ఊళ్ళోనే ఎగ్జిబిషన్! ఒక్కపూట తీరిక చేసుకోండి అని అడుగుతూంటే మీకేమో చెవుల్లో చెట్లు మెలిచాయి!" అని రాగాలు తీస్తుంది అండాళమ్మ.

నెత్తి బరువు నేలపడ్డట్టు తేలికగా నిట్టూరుస్తాడు పతిదేవుడు!

"నా ఎగ్జిబిషన్ చూస్తూనే వున్నావుగా దినమూ!"- అంటూ దీనాతిదీనంగా చూస్తాడు. ఆ చూపుల్లో విసుగు హాయత నిండుకొని ఉంటుంది. అర్ధాంగి కోరికను తీర్చలేని తపన తైతక్కలాడుతూ ఉంటుంది

అండాళమ్మ విలువునా నీరుగారిపోతుంది!

"పాడు ఎగ్జిబిషన్! చూళ్ళేకపోతే పోతుంది. అయిదుమందిని నెత్తినేసుకొని అహోరాత్రాలుగా ఫైళ్ళతో వేళాపాళా లేకుండా సతమతమయిపోతున్న పతిదేవుడికంటేనా?— ఆ బోడి ఎగ్జిబిషన్!"-అని అప్పటికయితే సమాధానపడుతుంది అండాళమ్మ.

కానీ—

ప్రతిదినము సాయంకాలము నాలుగు గంటలయ్యేటప్పటికి పక్కింటి పార్వతమ్మ ఎదురింటి నవనీతమ్మ మూడో యింట్లో మునిరత్నమ్మ నాలుగోయింట్లో నాగరత్నమ్మ సందుప్రక్కన యింట్లో చంద్రకాంతమ్మ గుడికట్టిన రోజాల్లాగ వీధినపడితే అండాళమ్మ గుండెల్లో గుండ్రాయి పడుతుంది.

"ఛీ! ఏం బతుకో యిరంపరం లేవి బతుకు. ఓ మంచీ లేదు చెడ్డా లేదు ఈ నాలుగ్గోడలే కైలాసంగా వుందీ బతుక్కి. ఆయన్నడిగితేనేమో ఒక్కపూటకే కొంపలు మునిగినట్టు ఆ ఆఫీసంతా ఆయనమీదే నడిచినట్టు మాట్లాడరు కానీ చూస్తారు.

ఆ చూపుల్ని చూస్తే 'అయ్యో'మనిపిస్తుంది. అందుకే పెద్దోళ్ళు కోతికయినా గీత చక్కంగా ఉండాలంటారు. నా తలరాత యిట్లా రాసినపుడు ఒకరినని యేం ప్రయోజనం?" అని గొణుక్కొంటూ చూడకూడదనుకొంటూనే గుడికట్టిన రోజాల్ని చూస్తుంది!

నిగనిగలాడుతున్న నీరెండలో వగలు పడుతుంటాయి రోజాలు!

ఎత్తు మడమల జోళ్ళ పైకెక్కి వెనుకాముందు చూచుకొంటూ ముందుకే నడుస్తున్న ఆ రోజాలు చూడడానికి 'బలే మజాగా' ఉంటాయి!

ఒకావిడ పొట్టిజడ వీపుమీద అటు యిటు పడలేక పడుతూఉంటుంది - ఓ లావుపాటి మనిషి నడవలేక నడిచినట్లు, మరొక అవిడ పొడుగుజడ పిరుదులపై సరససల్లాపాలాడుతూ ఉంటుంది - ఓ సన్నని సంపెంగ హొయలుమీద నడిచినట్లు, ఇంకొకావిడ వదులుముడి మెడను ముద్దిడుకొంటూ ఉంటుంది - వయ్యారంగా!- మరొకావిడ నెత్తికెక్కిన ముడి 'స్కూటర్' చక్రాన్ని ధిక్కరిస్తూ ఉంటుంది వాళ్ళవెంటపడుతున్న సువాసనల్లో చిక్కుకొన్న ముక్కులు—ఏకధాటిగా ఎగపీలుస్తూ ఉంటాయి - మళ్ళీ అలాంటి అవకాశం దొరకదన్నట్లుగా!—

ఒక్కరోజు కాదు. రెండురోజులు కాదు. ఎగ్జిబిషన్ ఆరంభించిన నాటినుండి వరుసగా ప్రతిరోజూ నాలుగు గంటలయ్యేసరికి ఆ రోజాలు 'మమ్ము చూడు! మా అందం చూడు!' అన్నట్లుగా ఎగ్జిబిషన్ చూడడానికని బయలుదేరిపోతూంటే - ఒక్కపూట అలాంటి అవకాశానికి నోచుకోలేని అండాళమ్మ— ఆవేదన పడుతుంది. అదృష్టాన్ని అడిపోసుకొంటుంది. అంటే - అందులో అసహజం అవగింజంతలేదు. అందులో ఆడజన్మలకా?- చెప్పవలసిన అవసరమే లేదు.

అయిదురోజులుగా అలా గుడికట్టిన రోజాల్ని.... ఒద్దికగా స్కూటర్ పై వెళ్ళుతున్న ఆలుమగల్ని...కార్లల్లో పోతున్న కలిగినవాళ్ళనీ- ఎగ్జిబిషన్ చూడడానికని వెళ్ళుతున్న ఎందరెందరెందరెందరో చూచి చూచి విసిగిపోయింది అండాళమ్మ. అయిదురోజుల తరువాత ఆరో రోజుకి ఆమె ఓర్పు ఆవిరయిపోయింది!—అందుకే ఆరు నూరయినా నూరు ఆర

యినా అగ్రహారం కాళ్ళబోయినా ఆ రోజు 'ఎగ్జిబిషన్' చూచితీరాలనుకొంది అండాళమ్మ. 'ఎప్పుడు నాలుగుగంటలవుతుందా?' అని ఎదురుచూచే ఓర్పు ఎప్పుడో అవిర్లయిపోయింది కాబట్టి మూడుగంటలకే ముస్తాబయింది అండాళమ్మ.

'రాజా వస్తున్నాడు!' అని చోపుదారులంటే అది అందగించదు 'రాజా వచె రవితేజము లలరగ!' అని అడుగు కదుతూ రాగము మేళవించి పలికినపుడే ఆ రాజుగారికి ఠీవి! .... వినేవాళ్ళకు హాయి!! - అలాగే అండాళమ్మ బయలుదేరిందంటే అది చప్పగా వినిపిస్తుంది. అలా కూడదంటే కొత్త వివరణ కావలసి వస్తుంది. వివరించాలంటే చూడవలసి వస్తుంది. చూస్తే -

పదేళ్ళ పద్మ అందంగా ప్రక్కన నిలబడుతుంది అయిదేళ్ళ అనూరాధ చేయి పట్టుకొంటుంది. ఆ తరువాత అండాళమ్మ ఏటా బాలెంతరాలయిపోయింది కాబట్టి - నాలుగేళ్ళ నందన కొంగుపట్టుకొంటుంది. మూడేళ్ళ వనజ చంకలో ముద్దుగా ఉంటుంది.

అండాళమ్మకు ఆ నలుగురు కూతుర్లు నాలుగు దిక్కులు!

ఆ దిక్కుల్ని దాటి ఆమె కదలడమే కష్టం. కదిలితే నాలుగుదిక్కులతో కలిసి కదిలినట్లుంది.

అండాళమ్మ కదిలింది.

నాలుగుబారల దూరంలో నాలుగ్గాళ్ళ మంటపం. నాలుగురోడ్లు అక్కడ కూడుతాయి. ఏదో పెట్టి మరచినట్లు పెద్ద పెట్టున పోతున్న బస్సులు .... లారీలు.... వీటి మధ్య యిరుక్కొని విలవిలలాడిపోతున్న సైకిళ్ళు....రిక్షాలు- ఆ కూడలి ఎప్పుడూ మహారద్దీగా ఉంటుంది. అక్కడదారులు మారాలంటే దాటుకోవాలి దాటుకోవాలంటే ఎంతో జాగ్రత్తపడాలి. లేకుంటే ఏ కారో బస్సో మీదుగా దాటిపోవడం తప్పదు.

అందుకే అండాళమ్మ ఆ కూడలివద్ద కాసేపు ఆగవలసి వచ్చింది.

రోజూ ఆ కూడలివద్ద నిలబడి గుడికట్టిన రోజాల్ని గుచ్చి గుచ్చి చూసే కండ్లు 'అయ్యో! పాపం! .... పిల్లలకోడిరా' అంటున్నాయి. ఆ మాట చెవిని పడేసరికి అదరిపడింది అండాళమ్మ. అటుయిటు చూచింది. అల్లంత దవ్వులో గుమిగూడిన యువతరం తవైపే చూచి నవ్వుతూ ఉంది. అదరాబాదరా ఆ కూడలిని దాటుకోవాలని అడుగు ముందుకు వేసింది అండాళమ్మ. అంతలోనే సన్నని మూలుగు వినిపించింది. చూస్తే మూడోపిల్ల ముక్కుతూ ఉంది. ఆ పిల్లవైపు చూచింది అండాళమ్మ. 'నన్నుకూడా ఎత్తుకోమ్మా!'అని చేతులు పైకి చాపి దీనంగా చూపుల్లో చూపులు కలిపి అర్థిస్తూఉందా నాలుగేళ్ళ పిల్ల.

"చూడు తల్లీ! ఎగ్జిబిషన్‌లో నీకు మిఠాయిలు.... బిస్కత్తులూ .... కొనిపెడతాను. నా బంగారుకొండ కదూ?... గబగబ నడిస్తే బిస్కత్తులు మిఠాయిలు తింటూ ఎగ్జిబిషన్ చూడొచ్చు. నందన మంచిపాప! బాగా నడుస్తుంది!" అని బుజ్జగించింది అండాళమ్మ.

నాలుగేళ్ళ నందన ఆ బుజ్జగింపుల్ని అర్థంచేసుకోలేకుండా బుంగమూతి పెట్టింది.

పదేళ్ళ పద్మ దానిని చంకకెత్తుకోలేక అవస్థపడింది!

మరో పదంటే పదిబారలు ముందుకు సాగేసరికి పదేళ్ళ పద్మ అడుగు ముందుకు వెయ్యలేకపోయింది. నందన చంకదిగితే పద్మ నడుస్తుంది. కానీ అది దిగేటట్లుగాలేదు. దానిని చంకనుండి దింపి నడిపించడానికి లేనిపోని లంచాలు ఆశచూపుతూంటే అనూరాధ అందుకొనింది.

"ఎంతసేపూ దానికే కొనిపెడతానంటున్నావ్?.. మరి నాకో!"....మూతిని మూడువంకర్లు పోనిచ్చి ముద్దుముద్దుగా మూలిగింది అనూరాధ.

"నీక్కూడా కొనిపెడతానుండవే!.... అబ్బబ్బ! నా దుంపతెంచేదానికి పుట్టారు. వీళ్ళతో యేగేసరికి నా ప్రాణంపోతూ ఉంది!" అని విసుక్కొంటూ ఓ రిక్షా వాడిని పిలిచింది అండాళమ్మ!

ఒక్కడేం ఖర్మ? ... పిలుపు చెవిని పడడంతో ముగ్గురు రిక్షావాళ్ళు పోటీపడుతూ చుట్టుముట్టారు. అయితే మూడు రూపాయలకు మూడుపైసలు తగ్గించినా నసేమిరా కాదంటే కాదన్నారు.

అండాళమ్మ నోరు తెరిచింది!

"అదేందమ్మా! అట్టా నోరు తెరస్తావే!....ఈకడనుండి ఆ కడదాకా ఒకటే ఎక్కుడాయె! .... కడుపులో పేగులు నోట్లోకొస్తాయి!"

"అయితే మాత్రం యీడుందే యీనివర్పిటీకి మూడురూపాయలా!" ఆశ్చర్యాన్ని ప్రకటించింది అండాళమ్మ.

"అయితే మాత్రం మీరొక్కరా?.... యింతమంది నెక్కించుకొని తొక్కద్దూ? తొక్కితేగదా తెల్సేది!" ఎదురు పలికాయి రిక్షా గొంతులు.

"అయ్యో! అయ్యో!...యింతమందంటుండారే?....వీళ్ళదిష్టి కండ్లల్లో నిప్పులు పడా?" అని మనసులోనే మెటికలు విరిచింది అండాళమ్మ.

ఎదురు మాట్లాడే రిక్షావాళ్ళతో మాట్లాడటమే తప్పనుకొంది. వాళ్ళ మొగం చూడటమే పాపమనుకొంది. ఆ మూడురూపాయలంటే ఎగ్జిబిషన్‌లో పిల్లలకంత కొనిపెట్టవచ్చు ననుకొంది. అందుకే నడవడానికే నిర్ణయించుకొంది.

చంకలో బిడ్డ. చేయిపట్టుకొని మరొకబిడ్డ. కొంగులాగుతూ యింకొకబిడ్డ. అడుగు ముందుకు పడడమే యాతనగా తయారయింది. ప్రతి నాలుగయిదు బార్లకు కాసేపు ఆగి. చంకబిడ్డను ఈ చంకనుండి ఆ చంకకు....చేతిబిడ్డను ఈ చేతినుండి ఆ చేతికి మార్చుకోవలసి

వస్తూఉంది. దారివెంబడి వెడుతున్నవాళ్లు తనవైపు అదోకరకంగా చూస్తున్నట్లు అనుమానమయింది అండాళమ్మకు।

ఆమె ఎగ్జిబిషన్ చేరేటప్పటికి — నిజంగా వాళ్ళమొగాలు 'ఎగ్జిబిషన్ మొగాలు'గా తయారయ్యాయి।— అయినా ఆశ చెడ్డది కదూ।

బ్రదుకులో పాడి అలవాటయినా పాడి కాకున్నా చక్కెరకోసం కిరసనాయిలు కోసం నిలబడి నిలబడి 'క్యూ' పద్ధతి బాగా అలవాటయిపోయింది. ఆ క్యూలో నిలబడి టిక్కట్లుకొని బయటపడేసరికి 'ఎగ్జిబిషన్' చూచినంతపని అయింది.

ఎదురుచూస్తా వుంటాడనుకొన్న పతి దేవుడు పత్తాలేడు।

అయినా అండాళమ్మ ఎగ్జిబిషన్‌లో అడుగుపెట్టింది।।

అండాళమ్మ అలా అడుగుపెట్టిందో లేదో అనూరాధ 'అమ్మా।' అని చేయిబట్టి లాగుతూ ఒక చేతివ్రేలిని వంచి చూపిస్తూ ఉంది. వళ్ళు రగిలింది అండాళమ్మకు.

"ఇంతదూరం నడిచి చచ్చానే.... యిక్కడికి కొచ్చాకే రావాలా? అక్కడే డయిన కూర్చొని చావరాదూ"— అలుపు మనిషిని ఆలోచించనీయదు. అందుకే అండాళమ్మ విసుక్కొంది. విసుక్కొంటే సరిపోదుకదా?"— అందుకే నసుగుతూ నాలుగేళ్ళ నందనను పదేళ్ళ పద్మకు అప్పగించి — అనురాధ లఘుశంక తీర్చ డానికి అన్వేషణలో పడింది అండాళమ్మ।

అక్కడ 'గైడ్'గా వ్యవహరిస్తున్న ఒకానొక కుర్రవాడిని అడుగలేక అడిగింది. 'కక్కసెక్కడబాబూ?' అని. ఆ కుర్రవాడు 'ఇదో యిటు వెళ్ళండి!' అంటూ అటువైపు చేయెత్తి చూపాడు. అటువైపు బయలుదేరింది అండాలమ్మ. దాదాపు వంద గజాల దూరంలో వెదురు తడకలు ఆమెకు ఆశ్రయమిచ్చాయి. అనూరాధ శంకతీరింది. అండాలమ్మ 'బతుకు జీవుడా!' అనుకొంది. బయలుదేరిన చోటుకే తిరిగివచ్చింది.

అక్కడ నందన పద్మ కనుపించ లేదు।

అండాళమ్మకు పడుములు విరిగినంత పనయింది।

'ఎగ్జిబిషన్'లో వింతవింతగా కని పిస్తున్న వాటిని చూచుకొంటూ తనకు తెలియకనే తానుగా కదిలింది పద్మ. అమ్మ యిటు పద్మ అటు వెళ్ళేసరికి ఎటుపోవాలో తోచకుండా నాలుగేళ్ళ నందన తనదారి తను చూసుకొనింది.

అండాళమ్మకు కాళ్ళూ చేతులాడలేదు ఏమి చేయాలో తోచలేదు. ఊరు ఊరుగా కదలివచ్చి ఎగ్జిబిషన్‌లోనే కాపురం పెట్టినట్లుంది. ఆ రద్దీలో కను గందులు ఏమైపోయారో? అని కలవర పడింది. కాలుగాలిన పిల్లిలా అటు తిరిగింది. ఇటు తిరుగుతుంది. పిల్లలిద్దరు కనుపించకపోయేసరికి నిస్స హాయంగా నిలబడిపోయింది — కళ్ళ నీళ్ళతో।

"అక్కెక్కడమ్మా?" అనూరాధ అడుగుతూ ఉంది.

"ఛీ! పాడుముండా! నోరుమూసుకో! యిదంతా నీవల్లనే...." కసురుకొనింది అండాళమ్మ.

అమ్మ కసురుకోవడం .... అక్కా చెల్లి కనిపించకపోవడం.... ఆ లేత గుండె పగిలినంత పనిఅయింది. అలాంటి సమయాల్లో అలాంటి చిన్న బిడ్డలకు చేతనయిన పని ఒక్కటే'—దానికే నాంది వాచకం పలికింది. 'ఈ ఎగ్జిషన్ చూడ్డానికి ఎందుకొచ్చానా?' అని అండాళమ్మ తపనపడిపోయింది. చంకలో బిడ్డ .... చేతినిపట్టుకొని మరొకబిడ్డ— కాళ్ళీడ్చుకొంటూ తిరగనిచోటు లేదంటూ తిరిగింది.

అండాళమ్మకు తలప్రాణం తోకకే వచ్చింది వాళ్ళని వెదకి పట్టుకునేసరికి।

అక్కడ ఓ బొమ్మ!.... కట్టుతున్న కొత్త యిండ్లముందు వేలాడదీసిన దిష్టిబొమ్మలాంటి బొమ్మ. అయితే అట్టలతో అందంగా తయారుచేశారా బొమ్మను. చక్కని చొక్కాను. ప్యాంటును తొడిగారు. జీవంలేని ఆ బొమ్మ నమస్కరించమంటే నమస్కరిస్తూ ఉంది. నడవమంటే నడుస్తూఉంది. చేతిలో చెయ్యి కలపమంటే కలుపుతూ ఉంది. జనం ఈ వింతను విరగబడి చూస్తున్నారు. అండాలమ్మకూడా అందరిలాగే అటు వెళ్ళింది—నాలుగు దిక్కులు తోడున్నాయా లేదా అని పరిశీలించు కొంటూ।—

జీవంలేని ఆ బొమ్మ జీవమున్న మనుష్యుల్ని మాట్లాడిస్తూ ఉంది.

"చస్తే బతికించేదొకటి లేదబ్బా ఈ లోకంలో।" అని అమాయకులు ఆశ్చర్యాన్ని వెలిబుస్తూంటే "సైన్సు ఎంత ఎత్తు కెదిగింది. ఎలక్ట్రానిక్స్ ఎంత పని చేస్తున్నాయ్"।—అని చదువుకొన్నవాళ్ళు సంబరపడిపోతున్నారు — ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు.

ఆ బొమ్మను నిలువుకండ్లతో చూస్తూ నిలబడింది అండాళమ్మ।

అతంలో కొంగుబట్టి లాగినట్లని పించింది. అసహనంగా అటు చూసింది అండాళమ్మ।

"బిస్కత్తులు.... మిఠాయిలు కొని పెడతానన్నావ్।.... కొనీనేలేదు".... నాలుగేళ్ళ నందన అందంగా మూతి పెట్టి ఆరోపిస్తూఉంది.

"ఎప్పుడూ యేదో ఒక పోరు ఈ జన్మానికి।....నోర్మూసుకో।"

"బిస్కత్తులు కొనిస్తేనే..."

"లేకుంటే ఊరుకోవన్నమాట।"

"కొనిపెడతానని నువ్వే కదమ్మా చెప్పింది।"— ఎదురుపలికింది నందన.

అండాళమ్మ ఓర్పు నశించిపోయింది. అసహనం అరచేతితో చేయి కలిపింది.

చెంప 'ఛెళ్ళు' మనింది. నాలుగేళ్ళ నందన అరున్నొక్క రాగాన్ని అందుకొనింది. రాగాలాపన చేస్తున్న చెల్లెలు వైపు దీనంగా చూస్తూ అటుపై చెల్లెలితో శ్రుతి కలిపింది అక్క అనూరాధ. అక్కలిద్దరూ గుక్కపట్టేసరికి తానేం తక్కువ కాదంటూ చంకలోని చంటిది అక్కలిద్దరికీ మద్దతునిచ్చింది. ఎవర్ని ఎలా సముదాయించాలో తోచకుండా నిరామయంగా నిలబడిపోయింది అండాళమ్మ.

'ఎగ్జిబిషన్' చూస్తున్నవాళ్ళందరు— ఆ పనికి తాత్కాలికంగా వాయిదావేసి అండాళమ్మవైపే చూస్తున్నారు. గుడి గుచ్చిన రోజాలు ఆదారంబడి వెడుతూ అదోరకంగా చూస్తూ అలవోకగా నవ్వాయి—చేతిరుమాళ్ళమాటున.

అండాళమ్మకు తల కొట్టేసినంత పని అయింది!

క్షణం అక్కడ నిలబడలేకపోయింది. నాలుగేళ్ళ నందనను చేయిబట్టి బరబర లాక్కొంటూ బయటికి నడిచింది పదేళ్ళ పద్మ— అయిదేళ్ళ అనూరాధ— ఆవు వెంట పడిన దూడల్లా ఆమెను అనుసరించారు.

దాదాపు రాత్రి ఏడుగంటలు కావచ్చింది విశ్వవిద్యాలయ ప్రాంగణము వింతవింత కాంతులతో వెలిగిపోతూ ఉంది. వెలుగులకే వెలుగులిస్తూ సుందరాంగులు చెట్లనీడల్లోచేరి అందాలు వెదజల్లుతున్నారు. ఏరుకోలేని ఏ బ్రాసి మొగాలు వెకిలిచేష్టలు చేస్తున్నాయి. ఆలూమగలు చిలకాగోరువంకల్లాగ చెట్టాపట్టాలేసుకొని నడుస్తున్నారు. ఇద్దరు బిడ్డల్ని మగరాయుడు మోస్తుంటే— ఇంకొక బిడ్డని చేయిబట్టి నడిపించుకొంటూ మగువలు మందగమనం చేస్తున్నారు.

ఆ క్షణంలో పతిదేవుడిమీద ఎనలేని కోపం ముంచుకొచ్చింది!

"ఛీ! ఏం మనిషో? .... పాడు మనిషి!!" — అప్రయత్నంగా అండాళమ్మ నోటినుండి మాట వెలువడింది.

నిజమే కదా మరి! అయిదు రోజులుగా అడుక్కొనింది. ఇక్కింటి పక్కింటివాళ్ళు ఎలా వెడుతున్నది వివరించింది. ఒక్కపూట ఎలాగైనా సెలవు పెట్టమనింది చేతకాకపోతే పని తెముల్చుకొని అయిదుగంటలకైనా ఎగ్జిబిషన్‌వద్ద కలుసుకోమనింది. మగవాడు ఆ మాత్రం చేయకపోతే ఏ ఆడదైనా ఎగిరిపడకుండా ఉండమంటే ఉంటుందా?

అయినాకూడ అప్రయత్నంగా వెలువడిన మాటకే అండాళమ్మ లెంపలు వేసుకొనింది. అండాళమ్మ భారతనారి!

"అయ్యో! పొద్దస్తమానంవూ ఆ ఆఫీసులో అల్లాడి పొర్లాడి వస్తే— అంత కాఫీ యివ్వడానికి కూడ యింట్లో దిక్కుదరీ లేదే! నేనేంవో 'ఎగ్జిబిషన్.... ఎగ్జిబిషన్' అని వచ్చి ఎదవబతుకైపోయింది. తాళాలు కూడా పక్కింట్లో యిచ్చిరాకపోతినే! — పాపం! ఆయన ఆరుగంటలకే వచ్చి వీధిలో నిలబడి ఎదురుచూస్తూ ఉంటారేమో?"

ఈ భావన మనసులో మెదిలేసరికి విలవిలలాడిపోయింది అండాళమ్మ. అటుయిటు చూచింది. ఓ రిక్షావాడిని పిలిచింది. అంతో యింతో కొని పిల్లల చేతిలో పెడదామన్న పైసల్ని రిక్షావాడి చేతిలో పెట్టింది. వాలులతంగా వున్న బాట మీద రిక్షా వయ్యారాలుపోతూ సాగితే— కన్నుమూసి తెరిచేలోపల అండాళమ్మ యింటిముందు దిగింది.

వాకిట్లో నిలబడి ఎదురుచూస్తూ ఉంటాడనుకొన్న పతిదేవుడు లేకపోయేసరికి అండాళమ్మ మనసు అదోవిధంగా మారినా కుదుటపడింది. తలుపు తాళాలు తెరిచింది. లోనికి వెళ్ళింది. చంకలోని చంటిదాన్ని తొట్టిలో పరుండబెట్టింది. పాలసీసా దాని నోటికందించింది. ఆ తరువాత పిల్లలకి 'ఎగ్జిబిషన్ వేషం' విప్పి తానూ బట్టలు మార్చుకొనింది. ఎగ్జిబిషన్‌కి వెళ్ళకముందే చేయి కాల్చుకొనింది కాబట్టి— చేతులారా బిడ్డలకింత తినిపించింది. దాదాపు రెండున్నర కిలోమీటర్లు కాళ్ళీడ్చుకుంటూ నడిచేసరికి ఆ కసుగందులకి ఆవజీవాలు అణగిపోయినట్లయింది. కడుపులో అంత తడి పడేసరికి ఎక్కడివాళ్ళక్కడ వాలిపోయారు. ఆ తరువాత అండాళమ్మ వాకిట్లో నిలబడి పతిదేవుడికోసం ఎదురుచూడసాగింది.

పతిదేవుడు వచ్చాడు!

కిళ్ళీ నములుతూ సిగరెట్టుపొగ వలయాలు సృష్టిస్తూ దర్జాగా వచ్చాడు. అలా వస్తున్న పతిదేవుణ్ణి చూచేసరికి అండాళమ్మకు అరికాలిమంట నెత్తికెక్కింది. పైనబడి రక్కుదామన్నంత కోపం వచ్చింది. అయినా నిస్పృహయంగా నిలబడిపోయింది— కనుకొలకుల్లో కన్నీళ్ళు నిలబెట్టి!— ఆడదానికి చేతనయింది అదొక్కటే కాబట్టి!

పరిస్థితిని పసిగట్టిన పతిదేవుడికి మాటలు రాలేదు. ప్రయత్నించినా రావు. అందుకే బట్టలు మార్చుకొన్నాడు. అండాళమ్మ చేరవలసిన అలకపాన్పును తానాక్రమించుకొన్నాడు— ముందు జాగ్రత్తపడి.

ఇద్దరి మధ్య మౌనం కాసేపు రాజ్యంచేసింది. హైందవ సంప్రదాయంలో ఆలూమగల మధ్య అలకలు అభిప్రాయభేదాలు ఆరికకూడు ఉడికినంతసేపే! అందుకేనేమో?— అండాళమ్మ 'లేవండి భోజనానికి!' అని పిలిచింది.

ఆ పిలుపుకోసమే ఎదురుచూస్తున్నట్లున్న పతిదేవుడు పైకి లేచాడు.

"చూడు అండాళూ!" అని ఆప్యాయంగా పిలిచాడు.

ఆ పిలుపుకు ఆమె పలుకలేదు కానీ చూచింది.

"నా మీద చాల కోపమొచ్చింది కదూ ?"

ఆమె తలవంచుకొంది– మౌనం అంగీకారమన్నట్లుగా!

"ఏంచెయ్యమంటావ్ ?– అండాళూ! ఎగ్జిబిషన్ దగ్గర కలుసుకొందామని ఎంతో ప్రయత్నం చేసినాను. కానీ ఆఫీసు మేనేజరు అరవిందబాబు 'పార్టీ' యిచ్చాడు. అందర్నీ వుండమని పదేపదే చెప్పాడు. అలాంటప్పుడు వచ్చేస్తే ఆయన మరోక విధంగా అనుకొంటాడు. ఆ పరిస్థితుల్లో ... "

అండాళమ్మ కొస్త మెత్తబడుతూ ఉంది

"ఇంతకూ ఆయన పార్టీ ఎందుకు యిచ్చాడో తెలుసా ?"

అండాళమ్మ తెలియదన్నట్లుగా చూచింది.

"ఇద్దరు లేక ముగ్గురు చాలు! అన్నది ప్రభుత్వ నినాదం. ఈ నినాదానికి మద్దతు పలికాడు అరవిందబాబు! అంతే– ఆపరేషన్ చేయించుకొన్నాడు. అందుకని అతనికో 'ఇంక్రిమెంట్' అదనంగా వచ్చినది దానితో పాటూ రావలసిన 'యింక్రిమెంట్' కలిసింది. అరవింద బాబు ఆనందానికి ప్రతిఫలమే పార్టీ!... నేనూ అనుకుంటూనే ఉన్నాను!.... దేనికైనా కలిసిరావాలి మరి!" – అని దీర్ఘంగా నిట్టూర్చాడు పతిదేవుడు.

అండాళమ్మ ఆలోచిస్తూ వెళ్ళి అన్నం వడ్డించింది.

పతిదేవుడు తింటున్నాడు.

ఈ నలుగురి పిల్లలతో వేగలేకపోతున్నాను. వీళ్ళతో ఆ ఎగ్జిబిషన్ చూద్దామని కని వెళ్ళి నేపడ్డ బాధ వద్దుబాబు వద్దు పగవాళ్ళకైనా వద్దు! .... మీరు కూడ 'ఆపరేషన్' చేయించుకోండి!" – అండాళమ్మ ప్రక్కన కూర్చొని నేలమీద కాలిబొటనవ్రేలితో పిచ్చి గీతలు గీస్తూ కొతికికొతికి పలికింది!

పతిదేవుడు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు! ఆ మాటతోనే అతని కడుపు నిండిపోయింది. 'ఏమండీ? మారన్నం పెట్టుకోలేదే?' అని అండాళమ్మ అనుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళి పడుకొన్నాడు.

పడకమీద వెల్లకిల పడుకొంటే– ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి. ఒక్కసారిగా ఎన్నో బాధ్యతలు నెత్తిమీది నుంచే నేలపడ్డట్టు.... ఎన్నో.... ఎన్నెన్నో....

అండాళమ్మ కూడా అంత ఎంగిలిపడి భర్త ప్రక్కన చేరింది.

అలకపాన్పు అందాల పాన్పుగా ఒళ్ళు విరుచుకొంది.

అండాళమ్మ పతిదేవుడి నడుంమీద చెయ్యివేసింది.

అప్రయత్నంగా అతడామెవైపు తిరిగి పడుకొన్నాడు.

పతిదేవుడి చేయి సతి నడుంమీద పడింది.

"చూడండీ! చంటిదానికి మూడేళ్ళొచ్చాయి. ఓ వంశాంకురం ఉదయిస్తే – మీకో యింక్రిమెంటు వస్తుంది. నా ఆశలూ ఫలిస్తాయి. ఇంకో ఛాన్స్....'  అంటూ ముసిముసిగా నవ్వింది.

సతిపతుల చేతులు పంతాలు పలుకొంటే వాళ్ళిద్దరి మధ్య గాలి చొరవడానికి వెరచింది.

"నేనేమో శాస్త్రాలు చెబుతూ కుడితిలో పడతానంటూ గేలిచేస్తారు, మరి మీరో " అంటూ కిచకిచ నవ్వింది గోడమీది బల్లి.

*With Best Compliments from :*

# VENKATESWARA THEATRE

VISAKHAPATNAM